జయజయ శంకర


హరహర శంకర



సంపుటి : 2 సంచిక : 4

# శ్రీ కామకోటి వాణి

శ్రీ శోభకృత్ కార్తీక మాసం నవంబర్ 2023



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# 'భక్తి అనేది నిశ్చలంగా, నిస్సందేహంగా, చంచలరహితంగా ఉండాలి'


## దుండిగల్‌లో 'సర్వహిత మండపం' ప్రారంభోత్సవ సమయంలో శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారి అనుగ్రహభాషణం

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుః సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥

శ్రీ మహాత్రిపుర సుందరీ రమణ చంద్రమౌళీశ్వర ప్రసాద పరిలబ్ధ వాఙ్మయ విభూషితాశాంతరమ్ ।
నిరంతరముపాస్మహే నిరుపమాత్మవిద్యా నదీనదీశం అపరిభ్రమం మనసి శంకరాచార్యం గురుమ్ ॥

'మహాత్రిపుర సుందరీ రమణ చంద్రమౌళీశ్వర ప్రసాద పరిలబ్ధ వాఙ్మయ విభూషిత ఆశాంతరం' ఈ శ్లోకాలు కంచిపీఠంలో నిత్యం చదువుతారు. మహాత్రిపురసుందరీ సమేతుడైన చంద్రమౌళీశ్వరుని ప్రసాద లబ్ధి పొంది, ఆయన అనుగ్రహంతో గీతాభాష్యం, విష్ణుసహస్రనామభాష్యం, లలితాత్రిశతిభాష్యం, వ్యాసమహర్షులవారు వ్రాసిన బ్రహ్మసూత్రానికి శంకరులు రచించిన భాష్యాలు, ఉపనిషత్తులు, (ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండ, మాండూక్య, తిత్తిరిః) నృసింహ, తాపిని ఉపనిషత్తు, శ్వేతాశ్వతర ఉపనిషత్తు, ఉపదేశసాహస్రి, వివేకచూడమణి, మొదలగునవి – ముదాకరాత్తమోదకం – సదావిముక్తి సాధకం అని ప్రారంభించి శివానందలహరి, సౌందర్యలహరి, ఆనందలహరి మొదలైన అనేక స్తోత్రాలు, అష్టకాలు, పంచకాలు, మానసపూజాస్తోత్రాలు, వేదపాద స్తోత్రములు, వర్ణమాల స్తోత్రములు, హనుమత్పంచరత్నం వరకు ఉండే శంకరాచార్య వాఙ్మయం 'విభూషిత ఆశాంతరం' అంటే సర్వ దిక్కులకు వ్యాపించింది. అంటే అన్ని రకాల మనుష్యులకి ఉపదేశం ఇచ్చారనేది అర్థం. శంకరాచార్యులు 'భజ గోవిందం భజ గోవిందం' అని ప్రారంభించి 'యల్లభసే నిజ కర్మోపాత్తం, విత్తంతేన వినోదయ చిత్తం' అన్నారు. పని చేస్తే తృప్తిని పొందాలి. మనసులో సుఖం, సంతోషం, సంతృప్తి ఉండాలి. శంకరాచార్యులవారు దేశ పర్యటన చేసి అందరిలో ఆ ఆత్మసంతృపిని కలిగించారు. ఎలా అంటే మహాత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర పూజ చేత సంతోషాన్ని, సుఖాన్ని, శాంతిని లోకంలో కలిగించినవారు శంకరాచార్యులు. "ప్రసాద పరిలబ్ధ వాఙ్మయ విభూషిత ఆశాంతరమ్" – అన్ని చోట్లా 'ఇంక్లూసీవ్ గ్రోత్' అని ఈ రోజుల్లో చెప్తునట్లుగా అందరికీ మంచి జరగాలని చేసి చూపించినవారు శంకరాచార్యులు. 'విభూషిత ఆశాంతరం' ఆశాంతరమ్ అంటే అలంకారం, సౌందర్యం, గౌరవం. అంటే అన్ని దిక్కులకు కూడా గౌరవాన్ని కలిగించినవారు. సంపద, ఐశ్వర్యం, అనుగ్రహం, ఆశీస్సులు అన్ని చోట్ల ప్రసరింపచేసినవారు శంకరాచార్యులు. ఈ భూఖండంలో జన్మించిన అందరూ కూడా 'ఆయనను భగవంతుని యొక్క కృపాపాత్రుడు' అనుకునేవారు. దర్శనమే సౌభాగ్యం కలిగించేదిగా వారి చూపు, సంచారం, ఉపదేశాలు, తపస్సు ఉండేవి. అందుకే ఆయన్ని 'శంకరం లోక శంకరమ్' అని మనం పూజిస్తున్నాము. 'శ్రీ మహాత్రిపురసుందరీ రమణ చంద్రమౌళీశ్వర ప్రసాద పరిలబ్ధ వాఙ్మయ విభూషితా శాంతరమ్ నిరంతరముపాస్మహే – ఆ భగవంతుడైన చంద్రమౌళీశ్వరుణ్ణి, మహాత్రిపురసుందరిని పూజతో ప్రచారం చేసిన శంకరాచార్యులకి నమస్కరిస్తున్నాము.

'ప్రణమత కథితాని నిత్యమాచార్య పాదాద్' – ఆచార్యపాదులైన భగవత్పాదుల్ని నిత్యమూ మనం నమస్కారం చేస్తామని అప్పయ్య





దీక్షితులువారు చెప్పారు. ఇక్కడ 'నిరంతరముపాస్మహే' అంటే అమ్మవారి పూజ, ఆచార్యపూజ చేస్తే మనకు మంచి సంకల్పాలు కలుగుతాయి అని చెప్పడమే.

'ధనేన న రమామహే ఖల జనాన్ న సేవామహే', న చాపలమయామహే భవ భయాన్న దయామహే,

స్థిరాన్ తనుమహేతరాం మనసి కించ కాంచీరత – స్మరాంతక కుటుంబినీచరణ పల్లవోపాసనామ్

అని చెప్పి అమ్మవారి పూజ చేస్తే మనకు సత్సంగమే కలుగుతుంది. అది, ఇది కావాలన్న ఆశ పెరగదు. న్యాయమైన, ధార్మికమైన, సమాజానికి అవసరమైన ఆశలే ఉంటాయి. మన శక్తి, సామర్థ్యానికి సంబంధం లేని విషయంలో ఆసక్తి పెరగదు. సంసారమంటే కష్టసుఖాలు రెండూ ఉంటాయి. కష్టసుఖాలు కలిసిందే ఈ భూలోకం. అలా ఉన్నా ఈ సంసారంలో ఉండే మన కర్తవ్యాన్ని మనం నిర్వహించాలి. పెళ్ళి చేయడం, ఇల్లు కట్టుకోవడం, వాహనం తీసుకోవడం, పిల్లలకి చదువు నేర్పించడం ఇలాంటి ఎన్నో సంసారిక బాధ్యతలుంటాయి. ఇవన్నీ చూసి మనకి భయం, వ్యసనం, సంకటం కలగకుండా అమ్మవారి ఆశీర్వచనంతో ధైర్యంగా నమ్మకంతో ఉండగలుగుతాము. అమ్మవారు, శంకరాచార్యులు ఇద్దరూ ఒక్కటే.

**'కుండలి కుమారి కుటిలే ।**

**చండి చరాచర సవిత్రి చాముండే ।**

**గుణిని గుహారిణి గుహ్యే ।**


**గురుమూర్తే త్వాం నమామి కామాక్షి ॥**

'దేశిక రూపేణ దర్శితాభ్యుదయాం' అని అమ్మవారు ఆచార్య స్వరూపంలో మనకి అభ్యుదయ శ్రేయస్సుని కలిగిస్తుంది. దేశిక అంటే గురువు. భవ శంకర దేశిక మే శరణమ్ అంటారు. అభ్యుదయ, శ్రేయస్సుల్ని అమ్మవారు ఆచార్యుల రూపంలో మనకు చూపిస్తారు. 'నిరంతరం ఉపాస్మహే' – గురువుకి నిరంతరం ఉపాసన చేస్తుండాలి. 'నిరుపమ ఆత్మవిద్య' అంటే ఆత్మవిద్య, బ్రహ్మవిద్య, తత్త్వశాస్త్రం, అద్వైతం సత్యమని ఏదైతే చెబుతున్నారో అలాంటి విద్యకు పోలిక, సాదృశ్యం అనేది లేదు. 'రామ రావణయోర్యుద్ధం రామరావణయోరివ' ఆకాశానికి సముద్రానికి ఇంకొక ఉదాహరణ చెప్పలేం. అలా ఇక్కడ ఆత్మవిద్యలో తత్త్వశాస్త్రం అంటే అన్ని కష్టాలను సమూల నాశనం చేసే ఆత్మసుఖం. ఈ ఆత్మసుఖాన్ని 'ఆత్మరతి రేవస్యాత్' అని చెబుతారు. 'నిరుపమ ఆత్మవిద్యా నది' – ఆత్మవిద్య అనేది ఒక నిరంతర ప్రవాహం. ఆదిశంకరాచార్యులు కైలాసం నుండే యోగ చంద్రమౌళీశ్వరుని తీసుకువచ్చారు. అందుకని ఆత్మవిద్యకి శిఖరంగా, ప్రముఖుడిగా శంకరుని గురించే చెబుతారు. 'ఆత్మవిద్యా నదీ నదీశం' – ఈయన ఆత్మవిద్యామృత సముద్రం.

శంకరాచార్యులవారు అందరిలో ఆస్తిక్యం, సదాచారం, సౌజన్యం, సాత్త్వికత పెరగాలి అన్న సదుద్దేశ్యంతో అనేక విధాల ఉపదేశం చేసి ఉపదేశ మూలతత్త్వం ఒకటే అని నిరూపించారు. 'యది వేదాః ప్రమాణం స్యుః' – 'వేదాలు ప్రమాణమే ఐతే నాకు ఇబ్బంది కలుగకూడదు'. అని కుమారిలభట్టు అనే ఆయన ప్రాసాదంపై నుంచి క్రిందకు దూకారు. ఆయన 'వేదాలే ప్రమాణం' అని చెప్పి ఉంటే విషయం వేరుగా ఉండేది. ఇప్పుడు బ్రతికారు. కాని దెబ్బ తగిలింది. అంటే మన భక్తి అనేది నిశ్చలంగా, నిస్సందేహంగా, చంచలరహితంగా ఉండాలి. 'అపరిభ్రమం మనసి శంకరార్యం గురుం' – (శంకరార్య అంటే ఆర్యాంబ పుత్రుడు కదా!) శంకరార్య అని ఇక్కడ పదం చెప్పారు. 'శంకరార్యమ్ గురుమ్ మనసి' అని ఆయనని మనం నిరంతరం స్మరణ చేయాలని చెప్పారు.

కర్నూలు నుంచి కంచికి వెళ్తుండే సందర్భంలో 'ఔక్' అని ఒక ఊరిలో (తాడిపత్రి పక్కన) ఈ పద్యాలన్ని మహాస్వామివారు మాకు

చెప్పారు. కంచిపీఠంలో ఈ శ్లోకాలన్ని ఇప్పటికీ చెబుతారు. ఒక కార్తీక సోమవారం పౌర్ణిమ అని గుర్తు. ఆ రోజు జయేంద్ర సరస్వతిస్వామివారు పూజలు చేస్తుండగా ప్రక్కన గదిలో సాయంత్రం ఈ శ్లోకాలన్ని చెప్పారు. అప్పుడు తంజావూరులో వారి చిన్నవయస్సులో వ్యాసపూజ, చాతుర్మాస్యం చేయడం, తంజావూరు మహారాజవారి సన్మానాలు వచ్చి, ఊరేగింపుగా పల్లకిలో తీసుకొనివెళ్ళడం జరిగిందని చెప్పారు. ఒక ఫర్లాంగు దూరం పెద్ద ఊరేగింపు అని స్వామివారు చెప్పారు. వారి చిన్నవయస్సులో జరిగిన ఒక సందర్భాన్ని మాకు చెప్పటం జరిగింది. అప్పుడు ఈ శ్లోకాన్ని ఇంకా కొన్ని పద్యాలన్ని చెప్పారు. "భం భం భమితి జైత్రాంక శంఖ ధ్వనిః । జయ గోవింద భగవత్పాద పాదాబ్జ షట్పద । – 'అత్రైవర్గిక సంప్రదాయ పదవీ' అంటే త్రివర్గం. త్రివర్గం అంటే ధర్మార్థ కామం. చతుర్వర్గం అంటే ధర్మార్థ కామ మోక్షం. 1920-30ల రోజుల్లో స్వామివారు సంచారం చేసే సమయలోను, స్వామివారు అమ్మవారి ప్రసాదం తీసుకునే సమయం లోనూ ఈ శ్లోకాలు చెప్పాలి. స్వామివారి ఊరేగింపు, ప్రయాణం, ప్రవాసం మొదలు పెట్టారంటే ఒక శ్లోకం చెప్పాలి. ఎవరో ఒక పండితుడు ఇవన్నీ చెప్పి 'స్వామి పరాక్' అని చెప్పేవారట. మన తిరుమలలో ఉత్సవమూర్తులను తీసుకువచ్చినప్పుడు ఈ శ్లోకాలన్ని చెప్తూ ఉంటారు. మేము ఇప్పుడు కొందరికి చెప్పి వెతికించి, అచ్చువేయించి, కంచి అధిష్ఠానంలో ఈ శ్లోకాలన్ని చెబుతున్నారు. అప్పుడు స్వామివారు చెప్పిన విషయాలన్ని తరువాత వెతికించాము. మరల అచ్చువేసి ఇంకా పదిమందికి ఈ శ్లోకాలన్ని నేర్పించి ఇప్పుడు బంగారురథ ఉత్సవం అధిష్ఠానంలో చేసినప్పుడు హారతి ఇచ్చిన తరువాత శ్లోకాలన్ని చదవండి అని చెప్పాము. పూర్వపు సాంప్రదాయంలో ఈ శ్లోకాలన్ని ఉండేవి. దానిని గుర్తు చేసుకొని అర్థాన్ని చెప్పారు స్వామివారు. ఈ మధ్య ఒకరోజు కర్నూల్‌లో



'ఔక్'లో ఆ రోజుల్లో తీసిన ఫొటోలను ఎవరో ఒక మంచి భక్తుడు తీసుకువచ్చి చూపించారు. స్వామివారు కర్ణాటక నుంచి వచ్చినప్పుడు కర్ణాటక – ఆంధ్రప్రదేశ్ బార్డర్‌లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు హెలికాప్టర్‌లో వచ్చి స్వామివారిని రిసీవ్ చేసుకొన్నారు. ఆ ఫొటో కూడా కంచిలో ఉంది. స్వామివారు రిక్షా పట్టుకొని వస్తుండగా ఈయన రిసీవ్ చేసుకొంటున్నారు. తరువాత ఎమ్.జి.ఆర్‌గారు కూడా స్వామివారు తమిళనాడు వచ్చినప్పుడు స్వాగతం ఏర్పాట్లు చేశారు. వేలూరు పక్కన స్వామివారు ప్రవేశం చేసినప్పుడు మూపునార్ వాళ్ళు, కోక ప్రభాకరరావు మొదలైనవారు వచ్చి ఇక్కడ స్వాగతం పలికారు.

అలాగే కాకినాడలో చంద్రమౌళీశ్వరస్వామి మండపాన్ని భక్తులందరూ ఉపయోగించుకోవాలన్న మంచి సంకల్పంతో అనురాగశర్మ, బెనర్జీ, వరప్రసాద్‌రెడ్డి వసంత దంపతులు కట్టించారు. చాతుర్మాస్య సందర్భంగా చంద్రమౌళీశ్వరస్వామి మండపంలో అనేక సభలు, ప్రవచనాలు, హోమాలు, సత్సంగాలు, కచేరీలు, హరికథలు రెండు నెలల పాటు జరిగాయి. దేవుని స్వరము పుస్తక ఆవిష్కరణ – దేవుని స్వరం అని దెలుగులో 4000వేల పేజీల స్వామివారి ప్రవచనాలు ఏడు వాల్యూమ్స్‌గా వచ్చింది. ఆ పుస్తకం ఇంగ్లీషులో ముందే వచ్చేసింది. కాని తెలుగుభాషలో రావడానికి తర్జుమా చేసేవారిని వెదికి తరువాత సమయ నిర్ధారణ చేస్తేనే అది సాధ్యమైంది. చాతుర్మాస్యంలో గురుపౌర్ణిమ బంగారు మండపంలో వ్యాసపూజ, తిరుపతిలో చేస్తున్నట్టు పుష్పయాగం బాగా చేశారు. దేవుని స్వరం పుస్తకంతో పాటు మహాస్వామివారి చిన్నవయస్సులోని ఫొటోలన్నీ పెట్టి ఊరేగింపు చేశారు. మంచి దృశ్యాలు గుర్తుకు వస్తున్నాయి.

వరప్రసాద్‌రెడ్డిగారి దంపతులకు చింతపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ద్వారా ఈ మహావిద్యాపీఠంలో 'సర్వహిత మండపం' అంటే 'సర్వేజనాః సుఖినో భవంతు' అనే ఉద్దేశ్యంతో కట్టించే సదవకాశం లభించింది. ఇప్పుడు మేము భూప్రదక్షిణలాగా యాత్ర చేస్తూ వస్తున్నాము. కర్నూలు నుంచి వస్తున్నాము. ముగ్గురు స్వాములవార్లు కలిసి చేసిన మొదటి చాతుర్మాస్యం ఇక్కడి హంద్రీనది ఒడ్డున జరిగింది. ఇప్పుడు కాశీకి చాతుర్మాస్యానికి వెళుతూ ఇక్కడికి వచ్చాము. చంద్రమౌళీశ్వరస్వామి పూజా మండపంలో అనేక ధార్మిక సత్సంగాలన్ని జరగాలని ఆ 'గురుమూర్తే త్వాం నమామి కామాక్షి' – 'దేశిక రూపేణ దర్శితాభ్యుదయమ్' అని చెప్పినట్టుగా గురుముఖమైన అమ్మవారి అనుగ్రహం ఉండాలని ఆశీర్వదిస్తున్నాము. గురుముఖంగా మనకి వచ్చే అనుగ్రహాలే స్థిరంగా, సైడ్ఎఫెక్ట్స్ లేకుండా, ఎఫెక్టీవ్‌గా ఉంటాయి. అలాంటి అనుగ్రహం పొందినవారు మన



బెనర్జీగారు. చిన్నవయస్సు నుంచి ఆయన చెన్నై వచ్చిన ప్రతిసారి స్వామివారి దర్శనం చేసుకొనేవారు. స్వామివారు పాదసంచారం చేస్తూ ఉండేటప్పుడు కూడా ఎంత పల్లెటూర్లో ఉన్నా అక్కడికి వెళ్ళి దర్శనం చేసుకొని ఆశీర్వచనం పొందిన సత్సంప్రదాయవేత్త. ఆయన ఈ మండప నిర్మాణ విషయంలో కలవడం మంచి విషయం. క్రిందటిసారి స్కందగిరి కుంభాభిషేకం కోసం వచ్చినప్పుడు పీఠంతో దుండిగల్ వచ్చాము. (కొన్ని చోట్ల మండపం తయారు అయిన తరువాత మేము వస్తాము. కొన్ని చోట్ల మేము వచ్చిన తరువాత తయారు అవుతుంది) అలా చంద్రమౌళీశ్వరస్వామి వచ్చిన వెంటనే ఈ మండపం కూడా తయారయ్యి అందుబాటులోకి వచ్చింది.

మహాస్వామివారు చంద్రమౌళీశ్వరస్వామి పూజని 13 వయస్సు నుంచి చేశారు. స్వామివారు 92 వయస్సులో కూడా చంద్రమౌళీశ్వర స్వామి ప్రదోష పూజ, అభిషేకం, సహస్రధార అభిషేకం చేశారు. ఆ రోజుల్లో ఈ విషయాన్ని ఆలిండియా రేడియోలో న్యూస్‌లో కూడా చెప్పారు. అలా మహాస్వామివారు రోజూ జరిగే నిత్యపూజను స్వయంగా వచ్చి దర్శనం చేసుకొని వెళ్ళేవారు. ఒకసారి జయేంద్ర సరస్వతీ స్వామివారు నెల్లూరు ప్రక్కన అల్లూరు అనే ఊర్లో ఉండేవారు. అప్పుడు చంద్రమౌళీశ్వరస్వామికి చందనాభిషేకం అయిన వెంటనే ఆ తీర్థాన్ని ఒక వ్యాన్‌లో మహాస్వామివారు ఎక్కడ ఉంటారో అక్కడికి పంపేవారు. అది వారు స్వీకరించేవారు. తరువాతనే వారేదైనా తీసుకునేవారు. 95 సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు, ఒక వేదిక మీద కూర్చున్న ఆ చోటు మాకు బాగా గుర్తుంది. అప్పుడు మేము వెళ్ళి స్వామివారిని అడిగాము. 'స్వామి! మీరు ఉదయం ఏమైనా తీసుకుంటే బావుంటుంది అని భక్తులు కోరుకుంటున్నారు అని'. దానికి స్వామివారు "నాకు చిన్నవయస్సు నుండీ అలవాటు లేదు. స్నానం అయితే కాని ఏమి తీసుకునేది లేదు." అని తమ సంకల్పంలో మార్పు ఉండదని చెప్పారు. దేశం, ధర్మం, సమాజంకోసం వారి ఆలోచనలు, కార్యక్రమాలు ఉంటాయి. వారి దర్శనం, అనుగ్రహం పొందే అవకాశం ఈ శతాబ్దంలో జన్మించిన వారందరికీ వచ్చింది. ఈ మండపంలో భక్తులందరూ కలుసుకొని ఉత్తరోత్తరం ఇక్కడ మంచి కార్యక్రమాలు చేస్తూ అమ్మవారి ఆశీర్వచనం, ఆచార్య స్వాముల ఆశీర్వచనం పొందాలని 'సర్వేజనాః సుఖినో భవంతు' అని మంచి జరగాలని అమ్మవారిని ప్రార్థన చేస్తున్నాము.

**జయ జయ శంకర హర హర శంకర**



# ‘ప్రేమను, అభిమానాన్ని చూపిస్తే మనుషులైనా జంతువులైనా దగ్గరికి వస్తాయి’ అని ఆదిశంకరాచార్యులు నేర్పించిన సూక్తి

## వర్గల్ విద్యాసరస్వతీ అమ్మవారి ఆలయంలో స్వామివారి అనుగ్రహభాషణం

**పంచాశదేవ లిపయః రవి వంశకానాం,**
**సంఖ్యాం అతీత్య భువి భాన్తి గుణాః నృపాణాం,**
**ఎతైరమూన్ కథమహం కథయామి దేవి,**
**మాతః సరస్వతి మమాత్ర కురు ప్రసాదం ॥**

శ్రీజయేంద్ర సరస్వతీ స్వామివారు పుట్టిన విల్లుపురం పక్కన సుల్తానాకొర్ డిస్ట్రిక్ట్‌లో యశాలం, బ్రహ్మదేశం, యన్నాయిలం అనే మూడు గ్రామాలు పక్కపక్కన ఉన్నాయి. ఇక్కడ పురాతనమైన దేవాలయాలు ఉన్నాయి. అక్కడ దొరికిన తామ్రశాసనంలోని సరస్వతీ స్తోత్రంలో ఈ శ్లోకం ఉంది. కవి దానిని గురించి తెలియజేస్తూ సంస్కృతభాషలో కేవలం యాభై అక్షరాలే ఉన్నాయి. ఎవరి గురించి మంచిగా స్తోత్రం చెప్పదలచుకున్నారో, గుణాల్ని వర్ణించాలనుకున్నారో, మహాత్మ్యాన్ని తెలియపరచాలనుకున్నారో అలాంటి సూర్యవంశానికి చెందిన మహారాజుల యొక్క గుణాల సంఖ్య అధికం. సూర్యవంశంవారు మంచి పనులు జీవితకాలంలో చాలా చేశారు అని చెప్తూ, కేవల యాభై అక్షరాలతో అసంఖ్యేయమైన, చెప్పలేని మంచి గుణాల్ని నేను ఎలా వర్ణించగలను. తల్లీ! సరస్వతీదేవి నన్ను అనుగ్రహించమ్మా! అని సరస్వతి పాత్ర కింద పైశ్లోకాన్ని వ్రాశారు. సూర్యవంశరాజులు సత్‌స్వభావము కలిగినవారు. సూర్యవంశం, చంద్రవంశం గొప్పవంశాలు అని

అంటారు. సూర్యవంశంలో జన్మించిన అవతారమే రాములవారు. వారి గురించి 'అగణిత గుణగణ భూషిత రామ్' అని చెప్తాం. అసంఖ్యేయమైన గుణాలకి ఆయన ఆకారం. 'సమస్త కళ్యాణ గుణాభిరామః' అని కూడా రాములవారి గురించి మనం అంటుంటాం. 50 అక్షరాలని లోకమంతా ధర్మప్రచారం చేయడానికి వాడారంటే, భగవంతుడు ప్రసాదించిన శక్తి సామర్థ్యాన్ని సత్సంకల్పంతో ప్రజలకి ఉపయోగం కలిగేటట్లుగా వినియోగించుకున్నారు. అది పదవి, అధికారం, ఆస్తులు, విద్య, శరీరంలో శక్తి ఏదైనా కావచ్చు. భగవంతుడు ప్రసాదించిన శక్తిసామర్థ్యాల్ని సద్వినియోగం చేయడం మనిషికి ఒక సంకల్పంగా ఉండాలి. అలా సూర్యవంశంలో జన్మించిన రాములవారి గురించి

**రామో రామో రామ ఇతి ప్రజానాం అభవన్ కథాః,**

**రామభూతం జగత్ సర్వం రామే రాజ్యం ప్రశాసతి.**

అని అందరూ రామ రామ రామ అంటుంటారు. రామ అంటే సంతోషం కలిగించే వారు అని అర్థం. రాములవారు ఎలా సంతోషం కలిగించారు అంటే ఈ రోజుకి ఆయన్ని స్మరిస్తే, ఆయన చరిత్రని మనం వింటే మనకు శ్రద్ధ, సత్సంకల్పం, ప్రేరణ కలుగుతుంటాయి. మంచివిషయాలు చేయడానికి ధైర్యం కలుగుతుంది. పదిమందిని కలిపి పనిచేసుకోవడాని సౌజన్యశక్తి మనకు కలుగుతుంది. అహంకారం లేకుండా కర్తవ్యాన్ని నిర్వహించడంలో శ్రద్ధ కలుగుతుంది. ఇదంతా రాములవారి యొక్క అవతార మహాత్మ్యం. పని చేత అందరికీ సంతోషం కలిగించడానికి అనేక ఉపాయాలు రామచరిత్రలో ఉన్నాయి. శాస్త్రానికి విరుద్ధమైన తోవలో కూడా సంతోషం అనేది కొంతకాలం కనిపిస్తుంది.

**స్రక్ చందన వనితాదీన్ విషయాన్ సుఖదాన్ మత్వా తత్ర విహరసే,**

**గంధఫలీసదృశా నను తేఽభోగానంతరదుఃఖకృతః స్యుః**

**చేతో భృంగ భ్రమసి బుధ భవమణుః వ్యవసాయా**

**భజ హర లక్ష్మీనరసింహ నగపద సరసిజ మకరందం ॥**

మరు భూమిలో, ఎడారిలో ఒయాసిస్‌లు వెతుకుతున్నట్లుగా భావించి తిరుగుతుంటే మనకి శ్రమ ఉంటుంది, పరిసరాలకీ శ్రమ ఉంటుంది. ప్రస్తుతం సారము, రసము లేని భూమిలో పర్యటన చేస్తున్నాము. భోగానంతర దుఃఖకృతః స్యుః అంటే లౌకికంగా, భౌతికంగా మనం చూస్తున్న, వాడుతున్న పదార్థాలు ఆ సమయానికి సుఖాన్ని కలిగించినా తర్వాత దుఃఖాన్ని కలిగిస్తున్నాయి. ధర్మం ఆచరించడం కొంత కష్టమైనా, కొంత పరిశ్రమ, తపస్సు, మౌనం, ఉపవాసాలు చేసిన తర్వాత మనకు సుఖాన్ని కలిగిస్తుంది. అలా రాములవారు ఈ దేశంలో ధర్మప్రచారం చేసి ఆ సూర్యవంశం తరపున

'కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్।






**ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో ధృడవ్రతః ।**
**చారిత్రేణ చ కో యుక్తః సర్వ భూతేషు కో హితః ॥**

అంటే సామర్థ్యం, సాత్వికం, బలం, ఓర్పు ఇలా అన్నీ కలిసి సరైన సమయంలో ఏ శక్తిని వినియోగించాలో, ఎంత వరకు వినియోగించాలో – అనే విషయంలో పరిపక్వత కలిగించేది ధర్మం. వివేకాన్ని, విశ్లేషణను, వివేచనశక్తిని కలిగించేది ధర్మం. అందుకనే ధర్మం అందరు తెలుసుకొంటే దాని ప్రకారం వారి యొక్క ఆచరణ, ఆలోచన, సాత్వికత, సౌజన్యం, శాంతి ఉంటాయి. ఏవైతే మంత్రాలు మీరు చదువుతున్నారో 'శం నో మిత్రః శం వరుణః' శం నో అస్తు ద్విపదే శం చతుష్పదే' వీటిలో 'శం' శబ్దము మంచిది. శాంతి అనేది – ధర్మప్రచారం, ధర్మాచరణ జరిగినప్పుడే ఉంటుంది. హిందూధర్మంలో ధర్మప్రచారం కోసమే గుడి, గోపురాలను కట్టించారు. గోపురదర్శనం – కోటిపుణ్యం అంటారు. 'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' అంటారు. అలా ఈ వర్గల్‌లో శ్రీవిద్యాసరస్వతీ గుడి నిర్మాణము, శనీశ్వర ఆలయం, ఇంకా అనేక దేవాలయాలను కూడా నిర్మించారు. అంటే జడంలో చైతన్యాన్ని తీసుకొనివచ్చేది సనాతనధర్మం. ఇటుకరాయి, ఫొటో, రాయి, పంచలోహ ధాతువులతో చేసిన విగ్రహాలను పెడతారు. మంత్రసిద్ధి, యజ్ఞశాల పూజ, నారీ సంధానం, మూలమంత్ర జపం చేత మృత్సంగ్రహణం నుంచి ప్రారంభించి కర్షణాది ప్రతిష్ఠాంతం చేసే సంస్కారముల ద్వారా ప్రతిష్ఠ చేస్తారు.

**'స్వామిన్ సర్వ జగన్నాథ యావదాచంద్రతారకం**
**తావత్త్వం ప్రీతిభావేన బింబేస్మిన్ సన్నిధిం కురు'**
**సద్యోజాత మూర్తయే నమో నమః'** అని మంత్రాలు చెప్పి ప్రాణప్రతిష్ఠ చేస్తారు.

మేము చిన్నవయస్సులో ఇవన్నీ చాలా విన్నాం. ఒక శైవాగమ పాఠశాల మా గ్రామంలో స్వామివారు పెట్టించారు. మన జయేంద్రసరస్వతీస్వామివారు, చంద్రశేఖరేంద్రసరస్వతీస్వామివారు, ఇద్దరూ పుదుక్కోట్టై సమీపంలో ఇలయాత్తంగుడిలో ఉండగా – ధర్మప్రచారం జరగాలంటే దేశంలోని ప్రతిగుడిలో అర్చకులు మంత్రాలను శుద్ధిగా పఠించి, నిత్యకర్మానుష్ఠానం చేస్తూ, ధూపదీప నైవేద్యాలను భగవంతుడికి అర్పిస్తే ఆ గ్రామానికి శ్రేయస్సు, మంచి ఆరోగ్యం, పంటలు బాగా పండటం, సకాలంలో వర్షాలు కురవడం జరుగుతాయి. అందువల్ల అర్చక వ్యవస్థను బాగు చేయాలని బాగా చదువుకున్న అల్లూరి విశ్వనాథాచార్య అని ఒక ఆయన్ని అధ్యాపకునిగా ఏర్పాటు చేసి కావేరీతీరంలో పెద్ద అగ్రహారంలో 'వ్యాస భారత శిల్పకళా సదస్సు' అని ఏర్పాటు చేశారు. (అప్పట్లో శ్రీకాళహస్తి, విజయవాడ,



సికింద్రాబాద్‌లలో బ్రహ్మానందరెడ్డిగారి పిరియడ్‌లో రామలింగరాజుగారు మినిస్టర్, పి.వి.నరసింహారావుగారు ఎడ్యుకేషన్ మినిస్టర్‌గా ఉన్న సమయంలో కూడా మూడు సభలు జరిగాయి) అప్పుడే ఇలయాత్తంగుడిలో కూడా పాఠశాల పెట్టించారు. విద్యార్థులు బాగా చదవాలని పాఠ్యక్రమం, పరీక్షలు పెట్టి చక్కగా చదివించారు. అక్కడ చదువుకున్న వాళ్ళే ఈ రోజు తమిళనాడు పెద్ద గుళ్ళల్లో అర్చకులుగా ఉన్నారు. కుంభాభిషేకాలు, గొప్ప కార్యక్రమాలు చేయగల 300మంది పండితులని స్వామివారు తయారు చేయించారు. అది ఇద్దరు స్వాములు ధర్మానికి, సమాజానికి, చేసిన మహత్తరమైన ఒక మంచి ధార్మిక సేవాకార్యక్రమం. మహాస్వామివారి ఆలోచనలు అలా ఉంటాయి. పేరుకోసం చేయడం కాని, అందరం చేస్తున్నదే చెయ్యాలని ఉండదు. స్వామివారు చేసినదే అందరూ చెయ్యాల్సిన మార్గంలో ఉంటుంది. స్వామివారి ఆలోచన ప్రకారం ఇప్పుడు అక్కడ చదువుకున్న శిష్యులందరూ కూడా అక్కడక్కడ వేదపాఠశాలలు ఏర్పాటు చేసి సేవ చేస్తున్నారు. మధురైమీనాక్షి అమ్మవారి గుడి నుండి, ఇంకా ప్రసిద్ధ గుడుల నుండి అర్చకుల పిల్లలను అక్కడికే పంపించి చదివిస్తున్నారు. మండనమిశ్రుని ఇంట్లో చిలుకలు శాస్త్రార్థం చెప్తుంటాయి అంటారు. అలా ఆ అగ్రహారంలో ఎప్పుడూ ఈ ధ్యాన శ్లోకాలు వినిపిస్తూ ఉంటాయి. **'స్వామిన్ మే సర్వజగన్నాథ యావదా చంద్రతారకం'** అలా సూర్యచంద్రులుండేంత వరకు గుడి చక్కగా వర్ధిల్లాలి.

పాత గ్రామాలలో ఎల్లమ్మగుడి ఉంటుంది. లోపల రాళ్ళుంటాయి. ఆ రాయిమీద కొన్ని అక్షరాలు, గీతలు ఉంటాయి. కొన్నిటి మీద యంత్రం చెక్కి ఉంటుంది. పసుపు పూస్తూ ఉంటారు. ఇవి ఆ గ్రామ ప్రారంభంలోనే ఉంటాయి. అక్కడ శిలాప్రాంగణంలో ఒకవైపు సూర్యుడు, ఒకవైపు చంద్రుడు ఉంటారు. నేపాల్ రాజధ్వజంలో సూర్యుడు, చంద్రుడు ఉండటానికి వారు చేస్తున్న ధర్మాలు, సేవాకార్యక్రమాలు శాశ్వతంగా ఉండాలి అన్న సంకల్పమే కారణం. ధర్మాచరణ ద్వారానే అందరికీ శాశ్వతమైన ఐశ్వర్యం వస్తుంది. 'శాశ్వతీ శాశ్వతైశ్వర్యా', 'యావదాచంద్ర తారకం తావత్త్వం ప్రీతిభావేన' – అన్నట్లు ఉండాలని అందరూ కోరుకుంటారు. నిరంతరాయంగా ఏ విఘ్నం కలగకుండా పరిస్థితులు మంచిగా ఉండి భగవంతుడు సంతోషంగా ఉండాలి. స్వామి ప్రీతిభావంతో ఆ విగ్రహంలో కూర్చోవాలంటే మంత్రాలన్ని శ్రద్ధగా, భక్తిగా చెప్తూ, అక్కడ వాడే పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార మొదలైన అభిషేక ద్రవ్యాలు శుద్ధంగా ఉండేలా చూసుకోవాలి. సమర్పించే విధానం వినయపూర్వకంగా ఉండాలి. అలా ఉంటే ఆయన ప్రేమగా కూర్చుంటారు. స్వామిని పిలవడం ఎంత ముఖ్యమో చక్కగా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రీతిభావనకి తగిన శాస్త్రభావం మనలో ఉండాలి. సాన్నిధ్యం కోసం పుణ్యాహవచనం, నిత్యపూజలు, శంఖపూజ, కలశపూజ చేయాలి. నిర్మాల్య శోధనం చేయాలి. (గురువాయూర్‌లో నిర్మాల్య దర్శనం చాలా విశేషం) మనం చేసే చెఱకురసం, గంధం అభిషేకాలకు ఒక్కొక్క ద్రవ్యానికి ఒక్కోరకం ఫలితం శాస్త్రంలో ఉంది. శాస్త్రప్రకారం అభిషేకాలు, అలంకారాలు చేసి నైవేద్యం చేయాలి. నైవేద్యం చేసి ఆయన కడుపు నిండితే 'దృష్ట్వా దేవాః తృప్యన్తి' అంటారు. దేవతలు చూస్తే చాలు. 'శ్రీమృత్యుంజయ గోయ త్రిభువనాధారం విశాలోదరం' అని శంకరాచార్యులు పరమేశ్వరునికి నైవేద్యం చేసేటప్పుడు చెబుతారు. పరమేశ్వరుని కడుపు త్రిభువనానికి ఆధారంగా ఉంటుంది. ఒక మెతుకు కృష్ణపరమాత్మ తిన్న తరువాత అందరికీ సుభిక్షం కలిగి ఆకలి దాహం తీరిపోయింది. పరమేశ్వరునికి ముందు మనం నివేదనం చేయాలి. నిశ్చల భక్తి పెరిగితే ఆత్మ నివేదనం వరకు వస్తుంది. మనం ముందు అన్న నివేదనం చేస్తే తరువాత అది ఆత్మనివేదనం వరకు తీసుకొని వెళ్తుంది. అందుకని అన్నం నివేదన

ముందు చేయాలి. తరువాత హారతి ఇవ్వాలి. సర్వాపరాధ క్షమాపణార్థం సర్వమంగళ ప్రాప్త్యర్థం' కర్పూర నీరాజనం, ప్రదక్షిణ చేయాలి.

**'పదే పదే సర్వ తపోనికృంతనం పదే పదే సర్వ శుభప్రదాయకం, ప్రదక్షిణం భక్తి యుతేన చేతసా, కరోమి మృత్యుంజయ రక్ష రక్షమాం'**

అని అలా ఒక్కొక్క అడుగు వెళుతున్నప్పుడు మన అకౌంట్‌లో ఉండే దోషాలు, పాపాలన్ని తొలగి మంచి, పుణ్యం వస్తూ ఉంటుంది. అలా ప్రదక్షిణాలు చేయడానికి ఆత్మప్రదక్షిణం, ఆలయప్రదక్షిణం, దేవిప్రదక్షిణం ఏదైనా పుణ్యమే.

ఇక్కడ వర్గల్‌లో గిరిప్రదక్షిణం చేయించే ఉద్దేశ్యం ఉందని చెప్పారు. ప్రదక్షిణాలు గురించి చెప్పాలంటే ఆవులు దూడని కనేటప్పుడు ద్విముఖం కనిపిస్తున్నప్పుడు ప్రదక్షిణం మహాపుణ్యం. మహాస్వామివారు 95 ఏళ్ళ వయస్సులో కూడా చేశారు. దాని వలన భూప్రదక్షిణం చేసిన పుణ్యం వస్తుంది. ఈ సంఘటన గురించి మేము కాకినాడ గోశాలలో చెప్పినందువల్ల వాళ్ళు కూడా స్వామివారి విగ్రహం గోశాలలో పెట్టారు. లోకం ఆయన దర్శనం కోసం ప్రతీక్ష చేస్తుండగా ఆయన గోప్రదక్షిణం చేయాలని భావించారు. అంత పెద్ద తపస్వి, జ్ఞాని కూడా ఆవు దూడని కనేటప్పుడు శిష్యులు వచ్చి విన్నపం చేస్తే అక్కడే కూర్చుని ఎదురుచూసి, గోవుకి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా హారతి ఇచ్చి, ప్రదక్షిణం చేసిన ఆ దృశ్యం ఇప్పటికీ కంటికి కనిపిస్తుంది. గోసంపదను కాపాడటం మన దేశం యొక్క ముఖ్య కర్తవ్యం. రాములవారు ఒక సందర్భంలో ఒక బ్రాహ్మణుడి చేతికి కర్ర ఇచ్చి ఆ కర్రని ఎంత దూరం వీలైతే అంత దూరంలో పడేయాలని చెప్పి ఆ స్థలం సరిపడా ఆవులని గోదానంగా ఇచ్చారని ప్రసిద్ధి. గోదానంలో గొప్పవ్యక్తి ఎవరంటే రాములవారు. అలా గోసంపదను, శాస్త్రసంపదను మనం కాపాడాలి. వేదం అనేది ప్రాణవాయువు వంటిది. అన్ని వాయువులు ముఖ్యమే. ప్రాణ,అపాన,వ్యాన,ఉదాన,సమాన అలా పంచప్రాణాలలో 'తాన్ బలిష్ఠ ప్రాణమువాచ. మా మోహం ఆపద్యథ. అహమేవ ఇమం పంచధా ఆత్మానం విభజ్య విధారయామి.' నేనే ఐదు వాయువులుగా ఉండి ఈ శరీరాన్ని ధరిస్తున్నాను. అని భగవంతుడే ఉపనిషత్తులలో చెప్పారు. మన ధర్మానికి వేదాలు ప్రాణము. వేదాన్ని, అక్షరాన్ని ఆచారాన్ని, అర్థ జ్ఞానాన్ని అనుష్ఠానాన్ని కాపాడితే పర్యావరణం బావుంటుంది. మంచి సంగీత కచేరి జరుగుతున్నప్పుడు అందరూ దగ్గరికి వస్తారు. అదే ఏదో శబ్దం, ఎవరో అరుస్తున్నారు అనుకోండి ఇంట్లో నుండి చూసి దూరంగా వెళ్ళిపోతారు. ఆదిశంకరాచార్యులవారు అదే ఉదాహరణ చెబుతారు. ' హరిత తృణ పూర్ణ పాణిం ఉపలభ్య సంప్రతి అభిముఖీ



భవంతి, దండోద్యత కరం ప్రతి పలాయంతే' ఆవులు అప్పుడే కోసిన పచ్చగడ్డి ఎవరి చేతిలో ఉన్నా దగ్గరకు వచ్చి కొంత సంకోచించినా తీసుకుంటాయి. అభిమానం కొద్దీ స్పందన ఉంటుంది. 'దండోద్యత కరం ప్రతి పలాయంతే' కర్ర పట్టుకుంటే పరిగెత్తిపోతుంది. 'పశ్వాదిభిశ్చ అవిశేషాత్' అంటే ప్రేమని చూపిస్తే మనుషులైనా, జంతువులైనా దెగ్గరికి వస్తారు. ఆవు, పచ్చిక అనే ఉదాహరణ ద్వారా ఆది శంకరులు మనకు నేర్పించిన తత్వమిది. మనం భయాన్ని చూపిస్తే దూరం వెళ్ళిపోతారు. శంకరులు దేశ పరిక్రమలో ఎక్కడో చూసిన విషయం ఉదాహరణగా చెప్పారు. ఆవుల దగ్గర ప్రేమ చూపించాలని ఉపదేశం కూడా చేశారు. గోగ్రాసం ఇవ్వండి. 'యత్ గోగ్రాస ప్రదానం వ్రత సుకృతం అవిశ్రాంతం ఉజ్జృంభతే స్మ' గోగ్రాస ప్రదానం ఒక సుకృతం, పుణ్యం. గోసేవ చేయడానికి ప్రోత్సాహం కలిగించారు శంకరాచార్యులు.

వేదం అనేది తల్లిదండ్రుల్లాగ ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లల్ని బాధ్యతగా పెంచి, పోషించి, మంచి నాగరికులుగా తయారు చేస్తారు కదా! వారికి కష్టమున్నా పిల్లలకి కష్టముండకూడదని భారతదేశంలో



ఉండే తల్లిదండ్రులు భావించే సహజసిద్ధమైన విషయం. లోకంలో పేదరికం, ఆడంబరం, ఆలస్యం, అశ్రద్ధ, అన్యాయం, అహంకారం ఉండకుండా అందరూ మంచివాళ్ళుగా ఉండాలి అని వేదం కోరుతూ ఉంటుంది. 'మాతృ పితృ సహస్రేభ్యోపి హితైషిణా వేదేన ఉపబృంహితం శ్రుత్యర్థం ఆదరణీయం' (హితైషి అంటే వెల్ విషర్ అంటారు ఇంగ్లీషులో) ఎవరికైనా మీ మంచిని కోరుకుంటున్నాము. అందుకే సలహా, సూచనలు ఇస్తున్నాము. ఈ విధంగా చేయండి అని చెప్తుంటాము. అలా మన మంచిని కోరుకుంటుంది వేదం. తల్లిదండ్రులు తమ సంతానం మంచిని ఎలా కోరుకుంటారో అలా వేయి తల్లిదండ్రులకు సమానంగా వేదం ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటుంది. అందుకని వేదాన్ని కాపాడితే లోకహితానికి సహకరించిన వాళ్ళమౌతాము. ఇక్కడకు వచ్చే ముందు దుండిగల్‌లో సర్వజన హిత మండపము ఆవిష్కరణ చేసి వచ్చాము. అలా హితైషి అనేది వేదం. వేదాన్ని కాపాడటానికి వర్గల్‌లో వేదపాఠశాల, స్మార్తపాఠశాల, శంకరమఠం కూడా నిర్మాణం చేశారు. ప్రతి జిల్లాలో ఒక శంకరమఠం ఉండాలి. ఎందుకంటే ధర్మప్రచారం జగరగడానికి ధర్మకేంద్రాలు, గుళ్ళు ఉన్నాయి. ఏ వ్యవస్థ ద్వారా ధర్మప్రచారం జరగాలో అలాంటి వ్యక్తుల్ని తయారు చేసే సంస్థలు శంకరమఠాలు. శంకరమఠాలను పెడితే అక్కడ భగవద్గీత, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, చైత్రమాసం నుండి ఫాల్గుణమాసం వరకు మనం ఆచరించవలసిన వ్రతాలు, నోములు, గురించి తెలియజేయచ్చు. పంచాంగాలు, పంచగవ్యము, పంచామృతము, పంచభూతము, పంచదేవతార్చన, పంచోపచారములు, పంచముఖ హారతి, గురించి తెలుసుకోవడానికి అక్కడ సామూహికంగా దీపపూజలు, గోపూజలు, హోమాలు చేసి ధర్మప్రచార కేంద్రంగా ధర్మవిద్యని నేర్పించే అవకాశం ఉంటుంది. ఆ విద్యా ప్రయోజనం గుడిలో వాడుకోవాలి. యూనివర్సిటీలలో, కాలేజీలలో నేర్పిస్తారు. ఇండస్ట్రీలలో దానిని వాడుతారు. అలా శంకరమఠంలో విద్యని నేర్చుకొని గుడిలో పూజలు హోమాలు చేస్తుండాలి. అందుకని శంకరమఠం అక్కడక్కడ పెట్టించి శంకరాచార్యులు ఏమి ఉపదేశించారో ప్రజల వద్దకు తీసుకొచ్చి ధర్మప్రచారం చేయాలి. క్రిందటి సంవత్సరం భాగ్యనగరంలో స్కందగిరికి కుంభాభిషేకానికి వచ్చాము. ఆ కుంభాభిషేకానికి వచ్చిన సందర్భంలో ఒకరోజు రాత్రి ఇక్కడికి వచ్చి సందర్శనం చేసుకున్నాము. రాత్రి చాలా సమయం అయింది కాని, ప్రజలందరూ ఆసక్తిగా ఉన్నారు. అప్పటి నుండి కొన్నిరోజులు ఇక్కడకి వచ్చి ఉండాలని వీళ్ళ ఆకాంక్ష. అప్పుడు మేము శంకరమఠం కనుక ఉంటే చంద్రమౌళీశ్వరస్వామి పూజకి ఏర్పాటు ఉంటుందని చెప్పాము. కొన్ని మాసాలలో దీని స్థలసేకరణ,



భవన నిర్మాణం అన్ని చేసి అనీల్ గుప్తా, అర్చనగుప్తాల సేవా సహకారంతో, చంద్రశేఖర సిద్ధాంతిగారు, యాయవరంవారు మంచిగా నిర్మాణం చేయించారు. ఈ రోజు చంద్రమౌళీశ్వరస్వామికి పూజ, అర్చన, రేపు భౌమాశ్విని రోజు, మంగళవారం – ‘ ‘మంగళం భగవాన్ విష్ణు: మంగళం గరుడధ్వజ, మంగళం పుండరీకాక్ష మంగళాయతనం హరి:’ అన్నట్లుగా జరిగింది.

కంచిలో పీఠం ఎదురుగా మంగళేశ్వరస్వామి గుడి ఉంది. అక్కడ అష్టోత్తరలింగం ప్రతిష్ఠించారు. భౌమాశ్వినిరోజు చండీయాగం చేస్తారు. సహస్రలింగం ప్రయాగలో ఉంది. ఈ సంవత్సరం వ్యాసపూజ చేసే ఉద్దేశ్యంతో అక్కడికి వేగంగా వెళ్ళడం జరుగుతోంది. గంగాతీరంలో 1933–34లో మహాస్వామివారు ఏ ఊరిలో వ్యాసపూజ చేశారో ఈ సంవత్సరం వ్యాసపూజ అక్కడే చేసే ఉద్దేశ్యం ఉంది. అక్కడ సిద్ధేశ్వర గుడి ఉంది. మహాస్వామివారు 39, 40 వయస్సు ఉండగా సిద్ధేశ్వర అష్టకం వ్రాశారు. సహస్రలింగం స్వామివారు కంచిలో తయారుచేయించి శివస్థానంలో పెట్టించారు. ప్రయాగలో ప్రతిష్ఠ చేసేటప్పుడు వేదపారాయణం చేస్తుండగా శిల్పి పనిచేయాలి. శిల్పి పనిచేస్తున్నపుడు వేదపారాయణం చేయాలి అని నియమం పెట్టి స్వామివారి సమక్షంలో అది తయారయింది. తర్వాత స్వామివార్లు సతారాలో ఉండగా స్వయంగా వెదురుపాత్రతో పాలాభిషేకం చేశారు. సతారాలో చిన్నకొండ గుట్ట మీద శంకరమఠంలో ఉండేవారు. ఆ మఠాన్ని జయజయస్వామిమఠ్ అని అనేవారు. అక్కడే ఇద్దరూ శంకరజయంతి ఉత్సవాలు చేశారు. ఒక ఏనుగుపైన శంకరాచార్యుల విగ్రహం పెట్టించి శోభాయాత్ర, అభిషేకాలు చేసి, అప్పుడు సహస్రలింగాన్ని ప్రయాగ క్షేత్రానికి పంపించారు. కంచిలో తయారయి, సతారాలో అభిషేకాలు జరిగి, ప్రయాగలో సహస్రలింగానికి ప్రతిష్ఠ జరిగింది. కాశీలో కూడా భౌమాశ్విని, నవమి కార్యక్రమం జరగబోతోంది. చాతుర్మాస్య భవ్యకాలంలో అధికమాసం కూడా విశేషంగా జరగబోతోంది. పంచాంగసదస్సులు, అగ్నిహోత్ర సమ్మేళనం, వేదపారాయణాలు, శాస్త్రపరీక్షలు, అద్వైతసభ ఇంకా అనేక ధార్మిక కార్యక్రమాలు ఈ గంగాపుష్కర సంవత్సరంలో కాశీలో జరగడం అనేది మన సుకృతము.

తెలంగాణా ప్రజలందరూ కూడా ఈ వర్గల్ ప్రాంతంలో వికాసం తీసుకురావాలి. భగవంతునికి భక్తునికి ధర్మప్రచారం సేతువు లాంటిది. ఆ సేతు నిర్మాణం చేయడానికి ఇలాంటి శంకరమఠ నిర్మాణం, వేద పాఠశాలలు ఉపయోగంగా ఉంటాయి. ఈ భవనాన్ని శీఘ్రగతిలో మంచిగా, సుందరంగా, భవ్యంగా కంచిపీఠంలో చెప్పిన ప్రకారంగా



ప్రాకార సహితంగా బాగా తయారు చేశారు. ఈ శంకరమఠం జిల్లాకి ఆదర్శంగా ఉండాలి. ఇతర జిల్లాలకి కూడా తెలంగాణాలో మంచి వ్యవస్థలు రావాలి. తెలంగాణాలో వేదసభలు చక్కగా జరుగుతున్నాయి. ఇక్కడ వేద శాస్త్ర అభిరుచి, ఆదరణ, అభిమానం, సత్కారం బాగా ఉంది. ప్రజల సాహచర్యం, భక్తుల స్పందన, ప్రభుత్వం యొక్క సహకారంతో నిర్మింపజేసిన బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవ సభకి చాలామంది వచ్చారు. ఇక్కడ ఉన్న రాఘవరాజు అన్నపూర్ణ దంపతులను విదేశాలకు పంపిస్తున్నాము. అక్కడ మన కంచిపీఠ భక్తులందరూ కలసి న్యూజెర్సీలో పది ఎకరాల్లో మణిమండపము కట్టి కంచికామాక్షమ్మవారి విగ్రహం, మన స్వామివారి విగ్రహం, పాదుకలు పెట్టి ఆ గుడికి కుంభాభిషేకం జరిపిస్తున్నారు. రాఘవరాజు తల్లిగారు దక్షిణామూర్తి స్తోత్రాలు బాగా చదువుతారట. సతారాలో స్వామివారు ఉండగా నిత్యము దక్షిణామూర్తిస్తోత్రం చదువుతూ శంకరాచార్యుల పల్లకి సేవ జరిగేది.

**మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వం యువానం**
**వర్షిష్ఠాంతే వసదృషిగణైరావృతం బ్రహ్మనిష్ఠైః ।**
**ఆచార్యేన్ద్రం కరకలిత చిన్ముద్రమానంద మూర్తిం**
**స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే ॥**
**విశ్వం దర్పణ దృశ్యమాననగరీ తుల్యం నిజాంతర్గతం**
**పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా ।**
**యః సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం**
**తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥**

స్వామివారి సమక్షంలో సహస్ర సభలు కూడా జరిగాయి. ఇక్కడ పెద్ద పండితులు పట్టాభిరామశాస్త్రిగారు, కాశీనాథశాస్త్రిగారు, జోషి, కాశీ నుంచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, నరసింహశాస్త్రిగారు, మధురలో మాణిక్యశాస్త్రిగారు, భోళా సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వంటివారు వచ్చి సతారాలో శంకర జయంతి, శాస్త్రార్థ సభలు చాలా బాగా చేశారు. మరాఠీవాళ్ళు కూడా శంకరాచార్య స్తోత్రం చదివి **'కరితోమీ పరిచర్య । హారతి యతివర్య। మాఘ శుద్ధ దశమీల।'** అని చెప్పి శంకరాచార్య చరిత్రలోని గీతాలన్నీ చెప్పి హారతి అద్ది స్వామివారికి ఇచ్చేవారు. దక్షిణామూర్తి అవతారం అనేది ముఖ్యమైన అవతారం. ఈ అవతారంలో ఆయన మౌనంగా ఉండి మన సంకటాలు, సందేహాలు తొలగిస్తారని నమ్మకం.

**'మౌనేన మందస్మిత భూషితేన మహర్షి లోకస్య తమోనుదం తమ్పి, విద్రావితాశేష తమోగుణేన ముద్రా విశేషేణ ముహుర్మునీనాం. నరస్య మాయాం దయయా విధత్తే। దేవో మహాన్ తత్త్వమసీతి బోధమ్॥**

పశ్చిమగోదావరి జిల్లాలో ఐ.భీమవరంవారు టి.టి.డి దేవస్థానానికి స్థలం ఇచ్చి, విశాలమైన భవనాల నిర్మాణం, పంచధాతువులతో చక్కటి మందిర నిర్మాణం చేసి, దక్షిణామూర్తి, కామాక్షి అమ్మవారి ప్రతిష్ఠ జరిపి, శంకరాచార్యులవారి చరిత్రలోని ముఖ్యమైన సన్నివేశాలు చిత్రీకరించారు. అక్కడే పీఠపూజ కూడా కొద్దిరోజులు జరిగింది. ఆ విధంగా పశ్చిమగోదావరి ప్రముఖ వేద కేంద్రంగా ఉన్నది. ఐ.భీమవరంవారు వారి తల్లిదండ్రులు, వారి ముందు తరం వారు ఎప్పటినుంచో తిరుమల తిరుపతి దేవస్థానానికి చేతనయిన సేవ చేయడం జరుగుతున్నది. ఈ ఐ. భీమవరంలో స్వామివారి ఆదేశాన్ని వారు శిరసావహించి పాఠశాలను నిర్మాణం చేసి శాస్త్రీయంగా నడుపుతూ ఉన్నారు. ఆ గ్రామా లన్నింటిలో అనూరాధ నక్షత్రానికి సంబంధించిన వకుళపుష్పం వృక్షాలు చాలా ఉన్నాయి. అలాగే విద్యావిధానం కూడా చాలా బాగా ఉంది. విదేశాలలో ఉండేవారు కూడా మన ధర్మాన్ని పోషిస్తూ, ఈ దేశంలో ఉన్న మంచి సంస్థలకి సహకరిస్తూ ప్రతి గ్రామంలో వేద శాస్త్ర పురాణ ప్రవచనాలు జరిగే విధంగా చూస్తున్నారు. 'హర్ పంచాయత్ మే పండిట్ హోనా హర్ మందిర్ తిరుపతి హోనా' అనేది సంకల్పంగా పెట్టుకొని ఈ చంద్రమౌళీశ్వర స్వామి మందిరంలో ఉత్తరోత్తర వేదశాస్త్రం, పురుషం, లక్షణం, చదివిస్తున్నారు. విద్యని మనం రక్షించాలి – విద్వాంసులని పోషించాలి.

ఆ ఉద్దేశ్యంతో తెలంగాణా ప్రాంతానికి ఆదర్శంగా, ఆలంబనగా, ఆకర్షణగా ఈ వర్గల్ విద్యా సరస్వతిమందిరం ఉంటూ ధర్మంకోసం, ధర్మప్రచారం కోసం ప్రయత్నం చేయాలి. వర్గల్ మంచి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని జయేంద్రసరస్వతీ స్వామివారు తరచూ ఇక్కడకి వచ్చి అందరినీ అనుగ్రహించి ప్రోత్సహించారు. వారి సంకల్పం అభివృద్ధికి కారణంగా ఉంటుంది. మంచి వికాసం జరగాలని కామాక్షీ అమ్మవారిని ప్రార్థిస్తున్నాము.

**జయజయ శంకర హరహర శంకర**



JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

**SRI KANCHI KAMAKOTI PEETAM**

**Jagadguru Shankaracharya Swamigal**

**Shrimatam Samsthanam, Kanchipuram**





# Vijaya Yatra

of

## Jagadguru Pujyashri Shankara Vijayendra Saraswathi Shankaracharya Swamigal

## Schedule upto 15 Jan. 2024

| DATE | PLACE OF PUJA |
|---|---|
| Upto 9th Dec. | Bhagavatpada Sabha, Ramnagar Nagpur, Maharashtra |
| 10-12 Dec. 2023 | Ramalayam, Tirupalli, Adilabad |
| 13-14 Dec. 2023 | Uttara Tirupathi Kshetram (Sri Ganapati Sachchidananda Ashram), Guganpally, Nizamabad |
| 15 Dec. 2023- 15 Jan. 2024 | Shankar Math, Subrahmanya Swami Devalayam, Skandagiri, Padmaraonagar, Secunderabad |

**For further details, contact +91 94231 04648**

Visit www.kamakoti.org and Kamakoti.tv for updates &
www.kanchimuttseva.org to contribute online

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి విజయయాత్ర విశేషాలు





**అక్టోబర్ 2వ తేదీ** వారణాసిలో శ్రీస్వామివారు సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయాన్ని సందర్శించి అనుగ్రహభాషణం చేశారు. విశ్వవిద్యాలయ నిర్వాహకులు స్వామివారికి పాదపూజ చేసుకున్నారు.






**అక్టోబర్ 2వ తేదీ** వారణాసిలో శ్రీస్వామివారు నిర్మాణ దశలో ఉన్న శంకర కంటి ఆసుపత్రి సందర్శించి, అక్కడి ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకొని, సూచనలు అందించి అనుగ్రహభాషణం చేశారు.






**అక్టోబర్ 3వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలోని ప్రఖ్యాత బనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాలయంవారు స్వామివారికి ఘనస్వాగతం పలికి, సన్మానపత్రాన్ని సమర్పించారు. స్వామివారు అనుగ్రహభాషణం చేసి ఆశీస్సులు అందించారు.





**అక్టోబర్ 4వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలో కేదార్‌ఘాట్‌లోని కేదారేశ్వర ఆలయాన్ని సందర్శించి అభిషేకం, పూజలు నిర్వహించారు.











**అక్టోబర్ 4వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలోని గణపతిశాస్త్రిగారి గృహం, శ్రీ రామతారక ఆంధ్ర ఆశ్రమం, అఖిల భారతీయ బ్రాహ్మణ కరివెన నిత్యాన్నదాన సత్రం, స్వామి విమలానంద తీర్థ వేదపాఠశాలలను సందర్శించి ఆశీస్సులను అందించారు.





**అక్టోబర్ 6వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలో గాయ్‌ఘాట్ లోని శ్రీరామమందిరాన్ని సందర్శించారు.






**అక్టోబర్ 6వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలోని శ్రీవల్లభ రామ్ శాలిగ్రామ్ సాంగ్వేద విద్యాలయాన్ని సందర్శించారు.





**అక్టోబర్ 7వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలోని కార్పత్రి మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించి అనుగ్రహభాషణం చేశారు.





**అక్టోబర్ 7వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలోని బ్రహ్మాస్వ భవనాన్ని సందర్శించి, భక్తులకు ఆశీస్సులు అందించారు.







**అక్టోబర్ 9వ తేదీ** శ్రీస్వామివారు వారణాసిలోని శ్రీమఠం పాఠశాలను (శ్రీ పట్టాభిరామశాస్త్రి వేదమీమాంస అనుసంధాన కేంద్రం) సందర్శించారు. అక్కడ పూర్వం శ్రీజయేంద్రసరస్వతీ స్వామివారు, శ్రీవిజయేంద్ర సరస్వతీ స్వామివారు, సందర్శించిన పాత చిత్రాలను పాఠకులు గమనించవచ్చు.





**అక్టోబర్ 9వ తేదీ** శ్రీస్వామివారు కాశీరాజ పాలెస్‌ను సందర్శించారు. అక్కడ కాశీరాజుగారు, వారి కుటుంబసభ్యులు స్వామివారికి పాదపూజ నిర్వహించి, ఆశీస్సులు పొందారు.







ఆగస్ట్ 3వ తేదీ వారణాసిలో వృక్షారోపణం కార్యక్రమంలో పాల్గొన్న స్వామివారు.






అక్టోబర్ 10వ తేదీ శ్రీస్వామివారు అయోధ్య వెళ్ళే మార్గంలోని సుల్తానాపూర్ గ్రామాన్ని సందర్శించి, అక్కడి భక్తులను ఆశీర్వదించి, అనుగ్రహభాషణం చేశారు.





అక్టోబర్ 10వ తేదీ శ్రీస్వామివారు దసరా నవరాత్రులను, మరియు అనేక కార్యక్రమాలను నిర్వహించడానికి అయోధ్యలోని ప్రమోద్వనంలో ఉన్న శ్రీకంచి శంకరమఠానికి చేరుకున్నారు.




అయోధ్యలోని సరయూనది ఒడ్డున మహాలయపక్షాల సందర్భంగా స్వామివారి సమక్షంలో దీపప్రజ్వలన జరిగింది.



అక్టోబర్ 14వ తేదీ శ్రీస్వామివారు అయోధ్యలోని సౌత్‌ఘాట్ వద్ద సరయూనదీ స్నానం చేశారు.



# అయోధ్యలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు












దసరా నవరాత్రుల సందర్భంగా నిత్యం జరిగే మహా త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర పూజ అనంతరం విశేషపూజలు, హోమాలు జరిగాయి. మూలా నక్షత్రం రోజున సరస్వతి పూజ నిర్వహించి, శ్రీవిద్యా హవనం, ఋగ్వేద సంహిత హవనం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అష్టమి రోజు చండీ హవన పూర్ణాహుతి జరిగింది. స్వామివారి సన్నిధిలో ఆయుధపూజ జరిగింది. ప్రతిరోజు సువాసిని, కన్యా పూజలు జరిగాయి.

# అయోధ్యరాముని పూజలు నిర్వహించిన స్వామివారు

**అయోధ్యలోని ప్రమోద్వనంలో శ్రీ కంచి శంకర్‌మఠంలో నిత్యం జరిగే శ్రీమహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి పూజలు నిర్వహించిన తరువాత శ్రీరామజన్మభూమి క్షేత్రం, అయోధ్యధామ్‌లో రామలల్లాకు శ్రీ విజయేంద్రసరస్వతీ స్వామివారు పూజలు నిర్వహించారు.**





క్షేత్రానికి చేరుకున్న స్వామివారు శ్రీరామ అష్టోత్తర అర్చన, దీపారాధన, చామర సేవను నిర్వహించారు.

పవిత్రమైన ఏకాదశి సందర్భంగా సాయంత్రం 4:30 గంటలకు అయోధ్య ధామ్‌లోని రామజన్మభూమి క్షేత్రంలోని రాంలల్లా యొక్క మేక్ షిఫ్ట్ ఆలయంలో శ్రీ స్వామివారు పూజలు నిర్వహించారు.





స్వామివారు నిర్మాణ స్థలానికి వెళ్ళి అక్కడ జరుగుతున్న మందిర నిర్మాణపనులను వీక్షించారు. నిర్మాణంలో పాల్గొంటున్న ఇంజనీర్లను మరియు కార్మికులను ఆశీర్వదించారు. రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ యొక్క ట్రస్టీలు, సభ్యులు స్వామివారి ఆశీస్సులను పొందారు. సాయంత్రం పూజ కోసం స్వామివారు తిరిగి శంకర్‌మఠానికి వచ్చారు.





అక్టోబర్ 27వ తేదీ శ్రీస్వామివారు అయోధ్యలో సీతావల్లభ కుంజ్ దర్శించుకున్నారు.

అక్టోబర్ 29వ తేదీన అయోధ్యలో శ్రీస్వామివారు బ్రాహ్మణసభ కార్యక్రమంలో పాల్గొని, భక్తులను ఆశీర్వదించారు.





అక్టోబర్ 29వ తేదీ శ్రీస్వామివారు అయోధ్యలో కొత్తగా నిర్మిస్తున్న రామ మందిరం నిర్మాణానికి ప్రక్కనే ఉన్న అతి సుందరమైన అమవరామ్ మందిరాన్ని దర్శించుకున్నారు.

అక్టోబర్ 29వ తేదీ శ్రీస్వామివారు అయోధ్యలోని శ్రీ నిత్య గోపాలదాస్ స్వామీజీ ఆశ్రమాన్ని సందర్శించారు.



నవంబర్ 2వ తేదీ శ్రీస్వామివారు అయోధ్యలోని చోటీ దేవ్‌కాళీ మందిరాన్ని దర్శించుకున్నారు.



నవంబర్ 4వ తేదీ రుద్రావర్త్ మహాదేవ ఆలయాన్ని దర్శించుకున్నారు.



అదేరోజున మాతా కాళీదేవి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ ఆలయం మరియు యాగశాల నిర్మాణానికి 1997లో శ్రీ జయేంద్ర సరస్వతీస్వామివారు భూమిపూజ నిర్వహించారు.



నవంబర్ 2వ తేదీ శ్రీస్వామివారు సీతాపూర్ చేరుకున్నారు.



నవంబర్ 4వ తేదీ శ్రీస్వామివారు మిశ్రిక్‌లోని దధీచికుండ్ దర్శించుకున్నారు.













నవంబర్ 4వ తేదీ నాడే శ్రీస్వామివారు నైమిశారణ్యంలోని లలితాదేవి, చక్రతీర్థ, వ్యాస్‌గద్దీ, శ్రీబాలాజీ మందిర్, శ్రీత్రిశక్తిధామ్‌లను సందర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీనారదానంద ఆశ్రమాన్ని కూడా వీక్షించారు.



నవంబర్ 16వ తేదీ శ్రీమఠం క్యాంప్ వారణాసి నుండి ప్రయాగరాజ్ చేరుకుంది. శ్రీస్వామివారు వారణాసి నుండి బయలుదేరి వింధ్యవాసిని అమ్మవారిని, కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని, కాశీలోని శ్రీకంచికామకోటిపీఠం వేదపాఠశాల పూర్వ విద్యార్థులు నిర్వహించే వేదపాఠశాలను సందర్శించి, విద్యార్థులను ఆశీర్వదించి, ప్రయాగరాజ్ చేరుకున్నారు.



నవంబర్ 16వ తేదీ మాజీమంత్రి అశోక్ వర్ధన్ వాజ్‌పేయి, ఆయన కుమారుడు హర్షవర్ధన్ వాజ్‌పేయి, అనేకమంది శ్రీవారి భక్తులు ప్రయాగరాజ్‌లో స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు. మింటోపార్క్‌లోని వాజ్‌పేయి నివాసంలో శ్రీమహాత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరుని అభిషేకం పూజలు నిర్వహించబడ్డాయి.





**నవంబర్ 17వ తేదీ** ప్రయాగ్‌రాజ్‌లోని మహావీర్ భవన్, అరుంధతీ వసిష్ఠాశ్రమం అనుసంధానపీఠంలో నిర్వహించిన శ్రీ అశోక్ సింఘాల్ స్మారక సభ సందర్భంగా శ్రీ స్వామివారు 'భారతీయ అస్తిత్వ కా అనుభూతి హిందుత్వ'పై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీస్వామివారి సందేశం అక్కడి లోకల్ మీడియాలో విస్తృతంగా ప్రసారం అయ్యింది.





**నవంబర్ 19వ తేదీ** ప్రయాగ్‌రాజ్‌కి 40కి॥మీ॥ దూరంలోని శృంగవేరపురం చేరుకుని గంగాతీరంలో ప్రత్యేక హారతులు నిర్వహించారు. అనుగ్రహభాషణం చేస్తూ గంగామహాత్మ్యం, భారతీయ సంస్కృతి గొప్పతనం గురించి వివరించారు. వాల్మీకి రామాయణంలో శృంగవేరపురానికి వున్న ప్రాముఖ్యతను తెలియజేస్తూ సీతారాములు వనవాసానికి ఈ ప్రాంతం నుండే నావలో గంగను దాటి వెళ్ళారని చెప్పారు.










**నవంబర్ 20వ తేదీ** వాజ్‌పేయి మింటో పార్క్ హౌస్ నుండి రాజర్షి టాండన్ మండప్ వరకు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారి "శోభా యాత్ర" జరిగింది. దారి పొడవునా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులందరికీ ప్రసాదాలు అందించారు. వేదిక వద్దకు చేరుకున్న శ్రీస్వామివారికి ప్రయాగ్‌రాజ్‌లోని ముగ్గురు ఎమ్మెల్యేలు, మేయర్, ఇతర ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. ప్రయాగ్‌రాజ్‌లోని అన్ని వర్గాలవారు శ్రీస్వామివారి దర్శనం చేసుకొని ఆశీర్వచనం పొందారు. కార్యక్రమ కన్వీనర్, ప్రయాగ్‌రాజ్ ఎమ్మెల్యే శ్రీ హర్షవర్ధన్ వాజ్‌పేయి ప్రజాసంఘాలను పరిచయం చేసి, స్వామివారికి గౌరవ వందనం సమర్పించారు.




నవంబర్ 21వ తేదీ శ్రీ స్వామివారు బ్రాహ్మణసంఘ సమావేశంలో అనుగ్రహభాషణం చేశారు. అనంతరం ప్రయాగరాజ్ మేయర్ నిర్వహించిన రామాయణ సత్సంగానికి వెళ్ళి సభను ఉద్దేశించి ప్రసంగించారు. తదనంతరం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్సలర్ శ్రీ గిరీష్ చంద్ర త్రిపాఠిగారు వారి నివాసంలో స్వామివారికి పాదపూజ చేసుకున్నారు. ఆ సందర్భంగా 96 సంవత్సరాలు కలిగిన త్రిపాఠీగారి తండ్రిగారు శ్లోకాలు పఠించగా స్వామివారు సంతోషించి ఆశీర్వదించారు.








నవంబర్ 22వ తేదీ శ్రీ స్వామివారు శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠా స్థలాన్ని దర్శించి అక్కడి అధివాసం విధివిధానాలను పరిశీలించారు. తరువాత శ్రీ ఆదిశంకర విమాన మండపాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీస్వామివారు భారతరత్న శ్రీ మదన్ మోహన్ మాలవ్య మనవడు జస్టిస్ గిరిధర్ మాలవ్య నివాసాన్ని సందర్శించి ఆ దంపతులను ఆశీర్వదించారు.





నవంబర్ 23వ తేదీ శ్రీహర్షవర్ధన్ వాజ్‌పేయి వారి మింటో పార్క్ నివాసంలోని సువిశాల ప్రాంగణంలో భారీసభను ఏర్పాటు చేశారు. శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు త్రికాల పూజను ముగించుకుని భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. పాల్గొన్న భక్తులందరికీ ప్రసాదాలు అందించారు. శ్రీస్వామివారు వాజ్‌పేయి కుటుంబసభ్యులను ఆశీర్వదించి ప్రయాగరాజ్ నుండి మధ్యప్రదేశ్‌లోని రేవా ప్రాంతానికి బయలుదేరారు.



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

శ్లో॥ తనిమాద్వైతవలగ్నం తరుణారుణ సంప్రదాయ తనులేఖం ॥
తటసీమని కాంపాయా: తరుణిమ సర్వస్వమాద్యమద్రాక్షం ॥23॥

**తాత్పర్యం :-** కంపాతీరమునందు కృశించిననడుముగల తన శరీరమున తరుణారుణసంప్రదాయరేఖలతో విలసిల్లుచున్న యౌవనసర్వస్వమైన కామాక్షీదేవిని నేను చూచితిని.

**బాలమనోజ్ఞా :-** నేను కంపానదీతీరమునందు ఆ తల్లి కామాక్షీదేవిని చూశాను అని చెప్తూ మహాకవి ఆవిడ ఎలా ఉన్నదో వర్ణిస్తున్నారు. కార్శ్యత్వము (కృశస్య భావః కార్శ్యత్వం) తో అద్వైతభావాన్ని కలిగి ఉన్నదిట ఆమె నడుము. అంటే రెండవది లేదని. కార్శ్యత్వమే ఆవిడ నడుము. ఆమె నడుమే కార్శ్యత్వమని రెండింటికీ అభేదమని చెప్తున్నారు. తరుణారుణసంప్రదాయతనులేఖతో ఆవిడ శరీరం అలరారుతోందిట. ఈ వివరణను శ్రీ దోర్భల విశ్వనాథశర్మగారి గ్రంథం నుండి గ్రహిస్తున్నాను.ఉపాసనలో శిశు, తరుణిమ,కాలిమ,అరుణిమ సంప్రదాయమని వివిధరకాలుగా ఉన్నాయి. తరుణిమసంప్రదాయంలో దైవాన్ని యువరూపంలో ధ్యానిస్తారు. అలాగే అరుణిమసంప్రదాయంలో ఎర్రనివర్ణంలో ధ్యానిస్తారు. ఎర్రనివర్ణంతో యువరూపంలో ఉన్న దైవాన్ని ధ్యానంచటం తరుణారుణసంప్రదాయం. మూర్తీభవించిన తరుణారుణసంప్రదాయమని ఆ తల్లిని వర్ణిస్తున్నారు. అలాగే ఉదయించే సూర్యుని వలె ప్రకాశిస్తోంది అని కూడా చెప్పుకోవచ్చు. అరుణిమవర్ణంతో “ అరుణాం కరుణాతరంగితాక్షీం” అని లలితాపరమేశ్వరిని ధ్యానిస్తారు కదా!

శ్లో॥ పౌష్టికకర్మవిపాకం పౌష్పశరం సవిధసీమ్ని కమ్పాయాః ॥
అద్రాక్షం ఆత్తయౌవ్వనం అభ్యుదయం కంచిదర్ధ శశిమౌళేః ॥ 24 ॥

**తాత్పర్యం :-** కంపాతీరమునందు మన్మథునికి సంబంధించిన పౌష్టికకర్మలపరిణామమైన

యౌవనముకలిగిన ఒకానొక శివుని యొక్క అభ్యుదయాన్ని నేను చూశాను.

**బాలమనోజ్ఞా :-** వైదికపుణ్యకర్మలలో పౌష్టికకర్మలు,శాంతికర్మలని రెండు విధాలు ఉంటాయట. ప్రారబ్ధకర్మలద్వారా రాబోవు కష్టనష్టాలను తట్టుకునే శక్తి కొరకు గ్రహాల ఉగ్రతను తగ్గించేవి శాంతికర్మలు. ఆరోగ్యమునకు ఆచరించేవి పౌష్టికకర్మలు. ఇవి ఆయుర్వేదానికి సంబంధించినవి. అటువంటి పౌష్టికకర్మలను చేయటం ద్వారా మన్మథుడు శివుని క్రోధానికి భస్మమైనప్పటికీ మరల అమ్మవారి అనుగ్రహంతో ఆవిడ నాభిలో ప్రవేశించి తిరిగి పుష్టిని పొందినట్లున్నాడు. **"హరక్రోధాజ్వాలావలిభిరవలీఢేన మనసా. గభీరే తే నాభీసరసి కృతసంగో మనసిజః...."** అని శంకరులవారు సౌందర్యలహరిలో ఉటంకించారు. మన్మథుడు అనంగుడైనప్పటికీ ఆ తల్లిలో ప్రవేశించాడు. ఆ తల్లి అనుగ్రహంతో మన్మథుని మీద ఉన్న ఆయన ఆగ్రహాన్ని పోగొట్టి అభ్యుదయాన్ని కలుగజేస్తోంది అని అధ్యాహారంగా మన్మథుని వృత్తాంతాన్ని చెప్తున్నారు.


JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

**SRI KANCHI KAMAKOTI PEETAM**

**Jagadguru Shankaracharya Swamigal**
**Shrimatam Samsthanam, Kanchipuram**





## కంచి మఠం భక్తులకు పిలుపు

పరమపూజ్య కంచి కామకోటి పీఠం 2520 సంవత్సరాల క్రితం జగద్గురు ఆదిశంకరాచార్యులచే స్థాపించబడిన ఒక చారిత్రాత్మక సంస్థ. ఈ గురుపరంపరలో 70 ఆచార్యులు తమ నిరాడంబరమైన ఉనికిని, దేశ సమాజ సేవలను, పరిపూర్ణ కృపాకటాక్షాలను మనకు అందించారు. శ్రీ కంచి కామకోటి పీఠం ఆచార్యుల వైభవం, వారు దేశానికి భారత చరిత్రకి చేసిన సేవలు, వారి జీవన సందేశాలను సేకరించడానికి, జాబితా చేయడానికి మరియు ప్రదర్శించడానికి Kamakotikosh.org అనే వెబ్సైట్ ను శ్రీ కంచి మఠం వారు తయారు చేశారు.

భక్తుల వద్ద ఉన్న శ్రీ కంచి మఠం, మరియు కంచి పీఠ ఆచార్యుల కథనాలు, ఫోటోలు, ఆడియోలు, వీడియోలు, మీడియా కథనాలు ఈ కోశము లో పొందు పరచడానికి మాకు ఈ క్రింది ఇమెయిల్ ID కి పంపవలసిందిగా శ్రీమఠం భక్తులకు మేము పిలుపునిస్తున్నాము. ఇది ముఖ్యంగా యువతరానికి ఒక గొప్ప నిధిగా ఉపయోగపడుతుంది.

ID: admin@kamakotikosh.org

## శ్రీ కామకోటి whatsapp ఛానల్

కంచి మఠం వార్తలు మరియు స్వామి వారి యాత్రా విశేషాలు, సూచికలు, మరియు ఇంకెన్నో విశేషాలు పొందుట కొరకు శ్రీ కామకోటి whatsapp channel లో సభ్యత పొందండి. సభ్యత కొరకు ఈ qr code ను స్కాన్ చెయ్యండి.

Visit www.kamakoti.org and Kamakoti.tv for updates &
www.kanchimuttseva.org to contribute online

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక



వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com




## For Sri Kamakoti Vaani Subscription



### Bank Details:

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

### Subscription

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM

JAGADGURU SHANKARACHARYA SWAMIGAL

SHRIMATAM SAMSTHANAM

1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

koo @kamakoti

Koo


www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA



గుహాయాం వసంతం స్వభాసా లసంతం
జనార్తిం హరన్తం శ్రయామో గుహం తమ్.